
సాక్షి గుంటూరు

గురువారం । 14 । డిసెంబర్ । 2023



ముగిసిన సద్ది వితరణ

గుంటూరు రూరల్: గత 31 రోజులుగా గోరంట్ల అభయాంజనేయ, షిరిడీ సాయి గుడిలో జరుగుతున్న స్వాముల సద్ది వితరణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



చిల్లకల్లులో డీజీపీ నేర సమీక్ష

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు సమీపంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం రాత్రి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ టీకే రాణా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో నవోదయం

నరసరావుపేట: నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో గురువారం నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి కె.సంజీవరావు బుధవారం పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో నిర్వహించే కార్యక్రమానికి అర్హులైన లబ్ధిదారులు విద్యా, ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం, యువ సాధికారిత కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు మంగళగిరికి మైనార్టీస్ కమిషన్ రాక

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కమిషన్ మంగళగిరి విచ్చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైస్ చైర్మన్ డాక్టర్ జాషువా దానియేల్, కమిటీ సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, షేక్ సైపుల్లా, జితేందర్ జీత్ సింగ్‌లు అందుబాటులో ఉంటారని, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీలు తాము ఎదుర్కొంటున్న అన్ని రకాల సామాజిక సమస్యలను, ఫిర్యాదులను రాతపూర్వకంగా నివేదించవచ్చని తెలిపారు.

జీజీహెచ్‌కు పోస్టులు మంజూరు

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాలకు పోస్టులు మంజూరు చేస్తూ శుక్రవారం మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్‌కు 110 పోస్టులు కాంట్రాక్టు, రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ విధానంలో మంజూరు చేశారు. వీటిలో స్టాఫ్‌నర్సు పోస్టులు 30, జనరల్ డ్యూటీ అటెండ్, ఇతర పారా మెడికల్ పోస్టులు ఉన్నాయి. గుంటూరు వైద్య కళాశాలకు నాలుగు పోస్టులు మంజూరు చేశారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌లు సదరు పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏపీ గురుకుల పాఠశాలలో ఉద్యోగాలు

చిలకలూరిపేట టౌన్: ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన పని చేయటానికి వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజాపేటలో గురుకుల పాఠశాలలో పని చేయటానికి పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ ఇంగ్లిషు, టీజీటీ మాథ్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ బీఈడీ , బీఎస్సీ బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికెట్ జిరాక్సు కాపీలతో స్కూల్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు. పురుష అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

15, 16 తేదీల్లో కౌమారదశ విద్యపై శిక్షణ

ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఈనెల 15, 16 తేదీల్లో కౌమారదశ విద్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలలో ఎంపిక చేసిన 135 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కౌమారదశ విద్యపై ఒక్క రోజు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరు, తెనాలి, బాపట్ల విద్యాశాఖ డివిజన్లలోని 67 ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు 15వ తేదీన, అలాగే పల్నాడు జిల్లాలోని 68 పాఠశాలలో ఉపాధ్యాయులకు 16వ తేదీన ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు డైట్ ఉపన్యాసకులు డాక్టర్ కె. ప్రసాద్ సెల్: 80192 07528, కె. యోగేశ్వరరావు సెల్: 95506 31731కు సంప్రదించాలన్నారు.

యార్డుకు 52,273 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 52,273 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,943 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 21,141 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి తెలిపారు.

పోలి కాంతులు



పోయిరావమ్మా పోలమ్మ అంటూ భక్తులు పోలిని స్వర్గానికి సాగనంపారు. కార్తిక మాసం పూర్తి కావడంతో బుధవారం పెద్దఎత్తున భక్తులు పోలిని స్వర్గానికి సాగనంపేందుకు విజయవాడ దుర్గాఘాట్‌తోపాటు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లోని స్నానఘాట్‌లకు తరలివచ్చారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచే పెద్ద ఎత్తున భక్తులు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. మరో వైపున నదీ తీరానికి రాలేని భక్తులు తమ ఇళ్లు, అపార్టుమెంట్లలో నీటి తొట్టెలను ఏర్పాటు చేసుకుని అందులో అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి వదిలారు. – విజయవాడ



ఉత్సవ వీరంగం

పల్నాటి రణక్షేత్రం కారెంపూడి కత్తిగట్టి కదంతొక్కిందా.. వీరావేశంతో నాగులేరు ఉవ్వెత్తున ఉప్పొంగిందా.. బ్రహ్మనాయుడి ఉగ్రనృసింహకుంతం సమరనాదం మోగిస్తూ ముందుకురికిందా.. పల్నాటి పౌరుషాగ్నిని రగిలించిందా.. అన్నట్టు పోరాటాల పురిటిగడ్డ పల్నాడు గర్జించింది. వీరారాధనోత్సావాలతో ప్రతి మదీ పులకించింది. వీరుల కొణతములతో వీరంగమాడింది.

- రణక్షేత్రంలో ఉప్పొంగిన ఉత్సాహం
- వైభవంగా పల్నాటి వీరారాధనోత్సవాలు
- ఆయుధాలకు గ్రామోత్సవం
- ఆసక్తికరంగా రాయబారం ఘట్టం





అర్ధరాత్రి చెన్నకేశవుని దర్శనానికి బయలుదేరిన పల్నాటి వీరాచారవంతులు
(ఇన్‌సెట్‌లో) వీరాచార నిర్వహణ కోసం కత్తి పట్టిన చిన్నారి →

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా బుధవారం రాయబారం ఉత్సవం ఆసక్తికరంగా జరిగింది. తొలుత వీరుల గుడి నుంచి పల్నాటి వీరాచారవంతులు తమ ఆయుధాలతో గ్రామోత్సవానికి బయలుదేరారు. వీరుల గుడిలో కత్తి సేవల అనంతరం చెన్నకేశవస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ చెన్నకేశవస్వామికి పూజలు చేశారు. ఆలయం బయట కత్తి సేవలు కొనసాగించారు. తర్వాత ఆలయం ముందున్న బ్రహ్మనాయుడు విగ్రహం వద్దకు వీరాచారవంతులు చేరుకుని పూలమాలలు, తులసి మాలలు వేసి ధూపం వేశారు. నమస్కారం చేశారు. అనంతరం అంకాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారి చెంతకు ఒక్కొక్కరుగా వెళ్లి దీవెనలు పొందారు. గుడిలో కత్తి సేవలు చేసుకున్నారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించడంతో పాటు మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత కోట బురుజు మీదుగా పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి తరలి వెళ్లారు. తరుణ్ చెన్నకేశవ వీరుల ఆయుధాలకు ధూపం వేశారు. అక్కడ కూడా కత్తి సేవలు కొనసాగాయి. ప్రధాన గ్రామోత్సవంతోపాటు కొందరు వీరాచారవంతులు ప్రత్యేకంగా కొణతములతో వీరంగమాడారు. అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి మొక్కులు చెల్లించారు. చిన్న పిల్లలు సైతం కత్తులు చేతబట్టి వీరంగమాడడం గమనార్హం. కొందరు వదిలిన వీరాచారాన్ని మళ్లీ స్వీకరించారు. ఇదిలా ఉంటే రాత్రికి వీర విద్యావంతుడు దర్శి ముక్కంటి వీరుల గుడి ఆవరణలో రాయబారం కథాగానం చేశారు. కోడి పోరులో ఓడిన బ్రహ్మనాయుడు పరివారం అరణ్యవాసం అనంతరం రాజ్య భాగం తిరిగి మలిదేవులకు ఇవ్వాలని కోరుతూ అలరాజు తన మామ నలగామరాజు వద్దకు రాయబారం వెళ్లిన ఘట్టాన్ని చాలా ఆసక్తికరంగా వివరించారు.



బ్రహ్మనాయుడు విగ్రహానికి తులసి మాల వేస్తున్న ఆచారవంతుడు

నేడు మందపోరు

ఉత్సవాల్లో మూడో రోజు గురువారం మందపోరు ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా అలనాడు బ్రహ్మనాయుడు ఆచరించి చూపిన సమతావాదానికి గుర్తుగా చాపకూడు సిద్ధాంతాన్ని అమలు చేయనున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకరరెడ్డి పాల్గొననున్నారు. బస్టాండ్ సెంటర్‌లో కన్నమదాసు మండపం వద్ద కన్నమదాసు సేవా సమితి ఏర్పాటు చేసిన మాచర్ల సర్వ సైన్యాధ్యక్షుడు కన్నమదాసు విగ్రహావిష్కరణ జరగనుంది.

భళా బాలోత్సవ్



బాలోత్సవ్ ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న విజయబాబు
చిత్రంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

- భారతీయ కళలతో రుగ్మతలు దూరం
- రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు
- వీవీఐటీలో ముగిసిన బాలల పండుగ

పెదకాకాని: భారతీయ కళలు, సంస్కృతి సామాజిక రుగ్మతలను దూరం చేస్తాయని రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు చెప్పారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్–2023 బుధవారం ముగిసింది. బాలబాలికలకు తీపిగుర్తులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు మధురానుభూతులు మిగిల్చింది. వీవీఐటీలో కొత్తగా ప్రవేశపెట్టిన శాస్త్ర సాంకేతిక ప్రదర్శన శాల, కార్యశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి, విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకశక్తిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య కలయికతో మెరుగైన విద్యను అందజేయవచ్చన్నారు. పాశ్చాత్య పోకడలు వెర్రితలలు వేస్తున్న ఈ రోజుల్లో తల్లిదండ్రులు పిల్లలకు సంస్కృతీ, సంప్రదాయాలను తెలియజేస్తూ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. బాలోత్సవ్‌ను దిగ్విజయంగా నిర్వహించిన వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. బాలోత్సవ్ వేడుకలకు దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. మూడు రోజుల్లో 15,000 మంది ప్రేక్షకులు బాలోత్సవ్ ప్రదర్శనలను తిలకించారు. 20 అంశాలలో 61 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు రెండు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను విజయబాబుతో పాటు వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ అందించారు.



వీవీఐటీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హేమచంద్రారెడ్డి

మూడో రోజు కోలాహలం

మూడో రోజు విచిత్ర వేషధారణ, శాస్త్రీయ జానపద బృంద నృత్యాలతో వీవీఐటీ ప్రాంగణం కోలాహలంగా మారింది. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. 64 బృందాలు మూడు వేదికల వద్ద జాతర వాతావరణాన్ని తలపించేలా సందడి చేశాయి. తెలుగు కళలు, సంస్కృతులకు అద్దం పట్టేలా చిన్నారులు ప్రదర్శించిన కళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ముగింపు వేడుకల్లో రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కళలకు పుట్టినిల్లు గుంటూరు జిల్లా

- నంది నాటకోత్సవ ఫైనల్స్ ఇక్కడే
- ఈనెల 23 నుంచి 29 వరకు పోటీలు
- ఐఅండ్‌పీఆర్ రాష్ట్ర కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి




మాట్లాడుతున్న ఐఅండ్‌పీఆర్ రాష్ట్ర కమిషనర్ విజయ్ కుమార్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా కళలకు పుట్టినిల్లని, అందుకే 22వ నంది నాటకోత్సవ ఫైనల్స్‌ను స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేస్తున్నామని ఐఅండ్‌పీఆర్ రాష్ట్ర కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 29 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 10.30 గంటల వరకు జరుగుతాయన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి మొత్తం 115 నాటక సమాజాలు పాల్గొనగా ప్రిలిమినరీస్‌లో కొన్ని నాటక బృందాలు ఓటమి పాలయ్యాయని, మొత్తం 38 ఫైనల్స్‌కు చేరాయని చెప్పారు. సుమారు 1,200 మంది నటీనటులు ఫైనల్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అద్భుతమైన నాటక ప్రదర్శనలతోపాటు చక్కని నటనా చాతుర్యాన్ని చూసే భాగ్యం జిల్లా ప్రజలకు కలుగుతుందన్నారు. ఫైనల్స్ రోజునే విజేతలకు వివిధ అంశాల్లో మొత్తం 78 అవార్డులు అందజేస్తామన్నారు. ప్రముఖ కవి, గాయకుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం గుర్తుగా పోటీలు జరిగే కళావేదికకు ఆయన పేరును పెడుతున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు వసతి, ఆహారం, రవాణా తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. సమాచార శాఖ రిటైర్డ్ జేడీ జాన్సన్, ఎఫ్‌డీసీ జీఎం ఎంవీఎల్ శేషసాయి, ఐఅండ్‌పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

విరభూసిన సంతోషాలు

- దళిత మహిళా రైతులకు ప్రభుత్వం వరం
- 22(ఏ) నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు
- 669 మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి
- 361.05 ఎకరాలకు సంపూర్ణ హక్కులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): సమాజంలో దళితులు గౌరవంగా బతికేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. సాగు భూములు అందించి వెన్నుతడుతోంది. మూడు దశాబ్దాల క్రితం దళిత మహిళా రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ, రుణంపై ఇచ్చిన భూములకు జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకం ద్వారా పూర్తి హక్కులు కల్పిస్తోంది. ఈ మేరకు జీఓ కూడా జారీ చేసింది. రైతులకు పత్రాలూ పంపిణీ చేస్తోంది. గుంటూరు జిల్లాలో 1991 నుంచి 2004 వరకు భూమి కొనుగోలు పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది దళిత మహిళలు సబ్సిడీ, రుణం ద్వారా భూములు పొందారు. అయితే రుణం చెల్లించే వరకు ఎస్సీ కార్పొరేషన్‌లోనే భూములు తనఖాలో ఉన్నాయి. 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.లక్షలోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ జీఓ నంబర్ 492 జారీ చేశారు. అయినా 74 మంది పత్రాలు ఎస్సీ కార్పొరేషన్ తనఖాలోనే ఉన్నాయి. అలాగే సబ్సిడీ, రుణంపై పొందిన భూములు 22(ఏ) నిషేధిత జాబితాలో ఉండిపోవడంతో రైతులకు ఎటువంటి హక్కులూ లేకుండా పోయాయి. దీంతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత మహిళా రైతులకు లబ్ధిచేకూర్చే విధంగా జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకాన్ని తీసుకొచ్చింది. ఫలితంగా ఎస్సీ కార్పొరేషన్‌లో తనఖాలో ఉన్న 74 మందిసహా మొత్తం 669 మందికి చెందిన 361.05 ఎకరాల భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి లభించింది. దీంతో ఈ భూముల హక్కుపత్రాలను లబ్ధిదారులకు అధికారులు అందజేస్తున్నారు. ఫలితంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సంపూర్ణ హక్కు పత్రం

దళిత మహిళా రైతులకు సంపూర్ణ హక్కులు



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత మహిళా రైతులకు కేటాయించిన భూములను 22(ఏ) నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్ 669 మంది దళిత మహిళా రైతులకు సంబంధించిన 361.05 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాం. హక్కు పత్రాలను దశలవారీగా లబ్ధిదారులకు అందిస్తున్నాం.

– టి.ప్రేమకుమారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్సీ కార్పొరేషన్

ప్రజా జీవనం మెరుగుకే పథకాలు

పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్, చిత్రంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడంతోపాటు, వారి అభివృద్ధికి కృషి జరగాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ–వైఎస్సార్ క్రాంతి పథంలో భాగంగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో ఉన్న సమస్యలను ముందుగా అధికారులు తెలుసుకోవాలన్నారు. సెర్ప్ సంస్థ పేదల కోసం ఏర్పాటైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేసేందుకు నిర్వహిస్తున్న మహిళ మార్టులు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. వ్యాపారంలో లాభనష్టాలు వస్తుంటాయని, మహిళలు చేస్తున్న వ్యాపారాలను అధికారులు జాగ్రత్తగా గమనించాలన్నారు. లోన్ రికవరీలు సక్రమంగా వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. సమావేశంలో సెర్ప్ సీఈఓ ఏ.ఎం.డి.ఇంతియాజ్ అహ్మద్, శ్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ నాంచారయ్య, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సెర్ప్ అడిషనల్ సీఈఓ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

24 మందికి స్టాఫ్‌నర్సులుగా నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం నేషనల్ హెల్త్ మిషన్ పథకం ద్వారా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగాలకు ఎంపికైన వారికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన 24 మంది స్టాఫ్‌నర్సులకు గుంటూరు జీజీహెచ్ ఎస్‌ఐసీయూకు ముగ్గురిని, మిగిలిన 21 మందిని గుంటూరు జీజీహెచ్, బాపట్ల ఏరియా ఆసుపత్రికి కేటాయిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన వారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో వాహనాల చోరీకి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో పలు వాహనాల చోరీ ఘటనలపై కేసులు నమోదయ్యాయి. వన్‌టౌన్ సీఐ రావి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కేసులను దర్యాప్తు చేశారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి నాగరాజు(28) వాహనాల చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నాగరాజును అరెస్ట్ చేసిన వన్‌టౌన్ పోలీసులు అతడి వద్ద నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును బుధవారం న్యాయస్థానంలో హాజరుపరచగా అతడికి రిమాండ్ విధించారు.

టీకాలు తప్పనిసరి

దొడ్లేరు(క్రోసూరు): అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వయసుగల పిల్లలకు, గర్భిణులకు డ్రాప్ అవుట్స్, లెఫ్ట్ అవుట్స్‌కు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వబడతాయని, తప్పకుండా వేయించుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ కే కోటేశ్వరరావు పేర్కొన్నారు. మిషన్ ఇంద్ర ధనస్సు మూడో విడత కార్యక్రమంలో గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ఇటీవల వ్యాధి నిరోధక టీకాలు వేయించుకున్న చిన్నారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, హెల్త్ సూపర్‌వైజర్ సాంబశివరావు, సీహెచ్‌వో శివుడు, ఆరోగ్యకార్యకర్త భూలక్ష్మి, ఆశ వర్కర్ అనుపమ పాల్గొన్నారు.

సమానత్వమే మా అజెండా

ఇంటర్వ్యూ

- పోరాటంతో కొన్ని హక్కులను సాధించుకున్నాం
- తెలుగు రాష్ట్రాలు స్పందిస్తున్న తీరు హర్షణీయం
- ఏపీలోనే మాకు పింఛన్లు అందజేస్తున్నారు
- ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన

తెనాలి: విభిన్నమైన జెండర్‌లో పుట్టినందుకు కుటుంబం ఆదరించదు, సమాజం ఆమోదించదు... పారంపర్యంగా భిక్షాటన, సెక్స్‌వర్క్ మాత్రమే జీవితం. భరించలేని మానసిక క్షోభ, భౌతికమైన హింసను ఎదుర్కొంటూ దారుణమైన రోజులు గడుపుతుండే తనలాంటి ట్రాన్స్‌జెండర్ల హక్కుల కోసం పోరాడుతున్నారు ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన. తెలంగాణ ట్రాన్స్‌జెండర్ పీపుల్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు కేఎన్‌వీ మోనాలిసాతో కలిసి తెనాలిలో ఇటీవల ఒక చర్చావేదికలో పాల్గొన్నారు. వారి ఉద్యమం, నేపథ్యంపై 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు రచన ముద్రబోయిన మాటల్లోనే...

■ రాజమహేంద్రవరం నా సొంతూరు. ఇంటర్‌నుంచి హైదరాబాద్‌లోనే. మగబిడ్డగా పుట్టిన నాకు ఊహ తెలిశాక నన్ను నేను ఎప్పుడూ ఆడపిల్లగానే అనుకున్నా. బలవంతంగా మగపిల్లాడిగా పెరగాల్సి వచ్చింది. వేసే డ్రెస్ ఇష్టం ఉండదు. స్కూలుకెళితే ఎక్కడ కూర్చోవాలి? ఏ వాష్‌రూమ్ వాడాలి...అంతా సంఘర్షణ. అన్నీ తట్టుకుని చదువుపై దృష్టి పెట్టాలి. చిన్నప్పట్నుంచీ అనుకున్నట్టుగానే ట్రాన్స్‌గా మారటం... ఎంత క్షోభ అనుభవించానో...! డిగ్రీ చేశాక నాకు ఉద్యోగం రాలేదు. తప్పనిసరై యాచన, సెక్స్‌వర్కర్‌గా 20 ఏళ్లు గడిపాను. ఆ కాలంలోనే ఎంకాం, సోషియాలజీలో ఎంఏ కూడా చేశాను.

■ చిన్నతనం నుంచీ అనుభవించిన మానసిక క్షోభ అటుంచితే, భిక్షాటన, సెక్స్‌వర్కర్‌గా నాలాంటివారు ఎన్నో బాధలు పడుతున్నారు. యాసిడ్ దాడులు, కళ్లలో కారం చల్లటం, బీరు బాటిల్‌తో కొట్టటం వంటివన్నీ రోజూ చూశాను. విభిన్నమైన జెండర్‌లో పుట్టినందుకు ఇన్ని బాధలు అనుభవించాలా? అని ప్రశ్నించుకున్నాను. ఎందుకు ప్రభుత్వాలు మాగురించి ఆలోచించవు... మేం మనుష్యులం కాదా? అనుకున్నాను. దీనిపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నా. అప్పుడే అంటే 2014లో 370 చట్టంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఓ టీవీ ఛానల్ చర్చావేదికలో పాల్గొన్నాను. అప్పుడే నా గురించి అందరికీ తెలిసింది. ఇంట్లో నిర్ఘాంతపోయారు. మా హక్కుల కోసం పనిచేస్తానని చెప్పి, వచ్చేశాను.



రచన ముద్రబోయిన, పక్కన కేఎన్‌వీ మోనాలిసా

> ఏపీ ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకొచ్చింది. 1091 టోల్‌ఫ్రీ నంబరును ఇచ్చారు. ఇక్కడ మాకు పింఛన్లు ఇస్తున్నారు. ఇందుకు రూ.75 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఇళ్లస్థలాలను ఇవ్వబోతున్నారు. ఉపాధి కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని నోడల్ ఆఫీసర్ సరితా మేడమ్ చెప్పారు. ఇది చాలా మంచి పరిణామం. తెలంగాణలో పింఛన్లు రావాల్సి ఉంది.

■ ట్రాన్స్‌జెండర్లకు రాజ్యాంగబద్ధమైన హక్కులున్నాయి... వాటిని కాలరాయొద్దని, సంరక్షించమని సుప్రీంకోర్టు ప్రభుత్వాలకు చెప్పింది. బ్యాక్‌వర్డ్ క్లాస్‌గా గుర్తించి, రిజర్వేషన్లు కల్పించమని ఆదేశించింది. ఆ హక్కుల అమలును మా ఉద్యమ కార్యాచరణగా మార్చుకుని ముందుకు సాగాం. అప్పుడే మోనాలిసా కలిసింది. తనది తెనాలి. టెన్త్‌క్లాస్ వరకు ఇక్కడే చదివింది. తెలంగాణ ట్రాన్స్ పీపుల్ అసోసియేషన్‌ను స్థాపించింది. మొదట పదిమందికి కలిసి హక్కుల సాధనకు ఉద్యమాన్ని ఆరంభించాం. మాతో సహా రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్న గ్రూపులన్నీ ఇప్పుడు జాతీయ నెట్‌వర్క్ మద్దతుతో నడుస్తున్నాయి.

■ సమాజం మాపట్ల ప్రవర్తిస్తున్న తీరును క్రూరమైనదిగా భావిస్తున్నాం. గురు-చేలా వ్యవస్థ మాకో రక్షణ ఛత్రం. మా సమూహమే ఒకరికొకరం సహకరించుకుంటాం. మా హక్కులపై మావాళ్లకు ముందుగా అవగాహన కల్పిస్తున్నాం. దాడులు, భౌతికహింస జరిగినపుడు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదుచేయటం, న్యాయం కోసం తిరగటం చేసేవాళ్లం. ఆధార్ కార్డు, రేషను కార్డు, ఓటు హక్కు వంటివి సాధించుకున్నాం. తెలంగాణలో ఎప్పట్నుంచో ఉంటున్న ఎనుక్స్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ వేసిన 'పిల్'తో హైకోర్టు కొట్టేయటం మాకో విజయం. సుప్రీం తీర్పు వచ్చాక దానిని అమలు కోరుతూ తెలంగాణ హైకోర్టులో పిటిషను వేశాం. ఫలితంగా అక్కడ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటైంది. ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ఉస్మానియాలో తెరిచారు. 'స్వాభిమాన స్ఫూర్తి' పేరుతో జూట్ బ్యాగ్ ప్రొడక్షన్ యూనిట్‌ను ప్రారంభించి ఉపాధిని కల్పించారు.

■ సుప్రీం తీర్పు ప్రకారం విద్య, వసతి, ఉపాధి హక్కులు కల్పించాలిన ప్రభుత్వాలను కోరుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రిజర్వేషన్లు ఉన్నట్టే, ఆయా వర్గాల్లోని రిజర్వేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక రిజర్వేషన్లను కోరుతున్నాం. లేకుంటే ట్రాన్స్ కమ్యూనిటీ భిక్షాటన, సెక్స్‌వర్క్‌కే పరిమితం కావాల్సి వస్తుంది. ఇవన్నీ చట్టరూపం దాల్చాలంటే చట్టసభల్లో చర్చ జరగాలి. మావాళ్లుంటేనే అది సాధ్యపడుతుంది. చట్టసభలకు వెళ్లేందుకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్ల కల్పించాలంటూ ఒక ప్రత్యేకమైన పోరాటం జరుగుతోంది.



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని బుధవారం గుంటూరులో శాసనమండలి విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినప్పటి చిత్రం. -సాక్షినెట్‌వర్క్

ఓటర్ల క్లెయిమ్స్‌ను పెండింగ్ ఉంచొద్దు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 5వ తేదీన తుది జాబితాలో ఇవి అప్‌డేట్ అవుతాయన్నారు. వీటిపై వివిధ పార్టీల రాజకీయ నాయకులకు విస్తృత అవకాశాలు కల్పించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఫొటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల లిస్టుల్లో జీరో డోర్ నెంబర్ లేకుండా పూర్తిస్థాయి సవరణ చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్వోలు ఖచ్చితంగా వెళ్లాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనవరి 26న క్రెడాయ్ 7వ ప్రాపర్టీ ఎక్స్‌పో

పాత గుంటూరు: జనవరి 26, 27, 28 తేదీలలో గుంటూరు సిద్ధార్థ గార్డెన్స్‌లో క్రెడాయ్ గుంటూరు వారి 7వ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని క్యాపిటల్ హోటల్‌లో బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభకు మామిడి రాము అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, క్రెడాయ్ గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి, సెక్రటరీ టి.వినోద్ రెడ్డి పాల్గొని బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించటం ప్రశంసనీయం అన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంత ఇంటికల నెరవేర్చటానికి క్రెడాయ్ గుంటూరు వారికి ఎప్పుడూ తమ సహకారం అందిస్తామన్నారు. బిల్డర్లు ఎన్ఓసీలు, పర్మిషన్లు సకాలంలో రావడంలేదని విన్నవించగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ వివిధ సంస్థలకు చెందిన హౌసింగ్ ప్రాజెక్టులతో నాణ్యమైన అపార్ట్‌మెంట్లు, ఇళ్ల స్థలాలను కస్టమర్లు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్లాన్ అప్రూవల్, లేబర్‌సెస్ నిర్మాణ వ్యయం అంశాలను గురించి వివరించారు. ట్రెజరర్ ఎం.ఎస్.వి.కార్తిక్, వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, డాక్టర్ దేవరశెట్టి సురేష్‌బాబు, సహాయ కార్యదర్శులు వల్లెపు శివనాగేశ్వరరావు, ఎ.వి.నాగార్జునరెడ్డి, కన్వీనర్ జి.వెంకట రెడ్డి, ఈసి మెంబర్స్ వై.పవన్ కుమార్, పాదర్తి సాహిత్, గోన శివ నాగబాబు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరించిన మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, శివారెడ్డి

జూనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో బుధవారం జూనియర్ అసిస్టెంట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 28 మందిని కౌన్సెలింగ్‌కు పిలువగా, 27 మంది హాజరయ్యారు. వీరిలో నలుగురు పదోన్నతి వద్దని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వగా, ఒకరు కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. ఆర్డీ డాక్టర్ శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ బి.శ్యామ్ అనిల్‌కుమార్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రమోషన్ ఇచ్చినందుకు పలువురు ఉద్యోగులు ఆర్డీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఆర్‌ఓగా ప్రమోషన్..

గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మెడికల్ రికార్డ్ టెక్నీషియన్ పూర్తి చేసిన కె.జె.వి.కృష్ణకుమారికి మెడికల్ రికార్డు ఆఫీసర్ (ఎంఆర్‌ఓ)గా ప్రమోషన్ ఇచ్చి మార్టూరు మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. బాపట్ల జిల్లా చుండూరు పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.ఎల్.ఎస్.శ్రీనివాసరావును ప్రమోషన్ కౌన్సెలింగ్‌కు పిలువగా, తనకు సూపరింటెండెంట్ పోస్టు తనకు వద్దని లిఖిత పూర్వకంగా ఇచ్చాడు.



ప్రమోషన్ ఆర్డర్ అందజేస్తున్న ఆర్డీ డాక్టర్ శోభారాణి

విద్యార్థుల కాళ్లకు పోలీసుల సంకెళ్లు

విచారణకు వచ్చిన ఏఎస్పీ

తెనాలిరూరల్: ఓ కేసు విషయమై స్టేషన్‌కు తీసుకువచ్చిన విద్యార్థుల కాళ్లకు పోలీసులు సంకెళ్లు వేసి కూర్చోబెట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చి తీవ్ర కలకలం రేపింది. పోలీస్‌స్టేషన్‌లో మైనర్ బీసీ, ఎస్సీ విద్యార్థుల కాళ్లకు సంకెళ్లు వేశారన్న విషయం వెలుగులోకి రావడంతో పోలీసు శాఖలో తీవ్ర దుమారం రేపింది. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా తెనాలిలోని ఓ జూనియర్ కళాశాలలో బాపట్ల జిల్లా అమృతలూరుకు చెందిన విద్యార్థి ఇంటర్ చదివాడు. గత విద్యా సంవత్సరంలో సెకండియర్‌లో ఉండగా సదరు విద్యార్థి ప్రవర్తన సరిగా లేకపోవడంతో కళాశాల ప్రిన్సిపల్ టీసీ ఇచ్చి పంపగా వేరే కళాశాలలో చదువు కొనసాగించాడు. తనకు టీసీ ఇచ్చిన కళాశాల ప్రిన్సిపల్‌ను, కళాశాలను వ్యక్తిగతంగా, దూషిస్తూ సదరు విద్యార్థి సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. దానిని తెనాలి నందులపేటకు చెందిన మిత్రుడికి పంపగా అతనూ వీడియోని పోస్ట్ చేశాడు. వీడియో గురించి సెప్టెంబర్‌లో తెలుసుకున్న ప్రిన్సిపల్ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. నవంబర్ నెలలో విద్యార్థులను విచారణ పేరిట స్టేషన్‌కు పిలిపించి పంపించడం చేస్తుండే వారు. కొద్దిరోజుల అనంతరం విద్యార్థుల కాళ్లకు సంకెళ్లు వేసి స్టేషన్‌లో కూర్చోబెట్టారు. ఈ దృశ్యాన్ని కొందరు ఫొటో తీయగా, పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు మూడు రోజుల క్రితం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. దీంతో ఘటన వెలుగులోకి వచ్చి పోలీసుల శాఖలో తీవ్ర దుమారం రేపింది. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో గుంటూరు జిల్లా ఏఎస్పీ శ్రీనివాసరావు (లా అండ్ ఆర్డర్) బుధవారం తెనాలి వచ్చారు. సుమారు రెండు గంటలకుపైగా ఇక్కడి పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపి వెళ్లారు. స్టేషన్‌లో ఉన్న విద్యార్థులు గోడ దూకి పారిపోయే ప్రయత్నం చేయడం కారణంగానే కాళ్లకు సంకెళ్లు వేసి కూర్చోబెట్టారని తెలుస్తోంది.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య



గుంటూరు రూరల్: పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం నల్లపాడు ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో చోటు చేసుకుంది. సీఐ కథనం ప్రకారం.. చిలకలూరిపేట తిమ్మాపురానికి చెందిన వంకాయలపాటి దివ్య (17) పాలిటెక్నిక్ చదువుతోంది. రోజులానే తన స్నేహితులతో సంతోషంగా గడిపింది. అనంతరం బాత్ రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థులు, హాస్టల్ యాజమాన్యం తలుపులు బద్దలుగొట్టి 108 సహాయంతో గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు దివ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృతురాలి తండ్రి పూర్ణచంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానంతో అమానుషం

- భార్యను హతమార్చిన భర్త
- మెడకు చున్నీ చుట్టి, కత్తితో పొడిచి కిరాతకం
- అమ్మవారి మాల తీసి మరీ ఘాతుకం

గుంటూరు రూరల్: భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను కిరాతకంగా హత్య చేసిన ఓ భర్త ఉదంతం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ రాంబాబు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన రమావత్ బోడియ్యానాయక్, భుక్యా సుజాత(28) దంపతులు. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. రెండేళ్ల క్రితం వీరు గుంటూరు నగర శివారుల్లోని చౌడవరం పరిధిలోని చంద్రరాజేశ్వరరావు నగర్‌కు వలస వచ్చారు. ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. బోడియ్య ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా, సుజాత మిర్చియార్డులో కూలి పనులు చేస్తుండేది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భార్యపై అనుమానంతో బోడయ్య ఆమెను ఎప్పుడూ కొడుతూ ఉండేవాడు. నెల రోజుల క్రితం బోడయ్య అమ్మవారి మాల ధరించాడు. సుజాతపై మరింత అనుమానం పెంచుకున్న బోడయ్య మంగళవారం మళ్లీ ఆమెతో గొడవ పడ్డాడు. దీంతో రాత్రి సమయంలో బోడయ్య తాను ధరించిన మాలను తీసి ఇంటికి వచ్చాడు. ఫలితంగా భార్యాభర్తల మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో తీవ్ర ఆవేశానికి లోనైన బోడయ్య సుజాత మెడకు చున్నీ చుట్టి, కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బంధువులకు ఫోన్ చేసి తన భార్యను హత్య చేసినట్లు చెప్పి ఆటోతో సహా పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహానికి జీజీహెచ్‌లో పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాంబాబు తదితరులు



సుజాత మృతదేహం

గ్రామీణులకు బజరంగ్ నేత్రజ్యోతి బాసట

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- పెదపాలెంలో 464 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కొరిటిపాడు(గుంటూరు): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ ప్రదాతగా నిలిచారని, రాష్ట్రంలో ఎవరు ఎలాంటి సేవా కార్యక్రమం చేయాలని తలపెట్టినా అంతటా జగనన్న స్ఫూర్తి నిండి ఉంటుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పొన్నూరు మండలం, పెదపాలెం గ్రామంలో బుధవారం బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమాన్ని స్థానిక పెద్దలతో కలిసి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అక్షరాస్యత ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో నేత్ర సమస్యలపై అవగాహన ఉంటుందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి కారణంగా అత్యధిక శాతం పాక్షికంగా అంధత్వం బారిన పడుతున్నారన్నారు. కంటి చూపును పాక్షికంగా కోల్పోయిన వారికి పూర్తిగా చూపు నశించకుండా రక్షణ కల్పిస్తూ, తిరిగి వెలుగును ప్రసాదించే బృహత్తర కార్యక్రమంగా బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి రూపుదిద్దుకుందన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమం వెనుక అంతర్లీనంగా జగనన్న స్ఫూర్తి నిండి ఉందన్నారు. బజరంగ్ సామాజిక సేవా విభాగ బృందం సభ్యులు గత రెండు రోజులుగా పెదపాలెం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలలో ఇంటింటికీ కరపత్రాలతో వెళ్లి గ్రామస్తులను శిబిరానికి సాదరంగా ఆహ్వానించారని తెలిపారు. ప్రత్యేకంగా ఆటోలను ఏర్పాటు చేసి రాకపోకలను నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో 464 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఏడు పని దినాలలో వ్యక్తిగత కళ్లజోళ్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ట్రి కాన్ క్లినిక్ గుంటూరు వారి సహకారంతో 65 మంది గ్రామస్తులకు ఫిజియోథెరపీ సేవలు అందించడం జరిగింది. ప్రముఖ నేత్ర వైద్య డాక్టర్లు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలకు వచ్చిన గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



శిబిరాన్ని పరిశీలిస్తున్న మురళీకృష్ణ

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
- లిసిప్రియ

నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్గిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపుర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపుర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

నా నేరం ఏమిటి?

నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.

- లిసిప్రియ, యాక్టివిస్ట్

యాక్ట్ నౌ

దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై, పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.

'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యాచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్ ఆషిక్



కుమారునికి వంట నేర్పితే? ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి - 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.



ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నీషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యుపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.





- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తల స్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

* హెల్త్ కేర్ నివేదిక

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.



లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటిక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్‌ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్‌ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70-80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.